# బొమ్మ చెప్పని రహస్యం

కె. రామలక్ష్మి

కథానిక

"ఆ బొమ్మ యింకేమాత్రం గోడనుంచినా త్వరలో నన్ను కీల్‌పాక్ తీసుకెళ్ళవలసి వుంటుంది" మంచంమీద కూర్చోడమే తడవుగా ఎటునుంచి చూసినా కన్పించే బొమ్మనిచూస్తూ అంది పార్వతి.

కీల్‌పాక్ స్టేజిలో పార్వతిని వూహించుకుంటూ కృష్ణమూర్తి నవ్వేడు.

"ఇంకా ఆ బొమ్మని అక్కడే వుంచావంటే నాకన్నంకూడా సయించదు కృష్ణా" ఏదో బాధ హృదయాన్ని పట్టి పీడిస్తున్నట్లూ, ఎంతో కష్టం మీద ఆ బాధని తానోర్చుకుంటున్నట్లూ, మళ్ళీ అంది పార్వతి.

కృష్ణమూర్తి ఏం మాట్లాడలేదు. ఏంమాట్లాడుతాడు! పార్వతి ఆ యింట్లో అడుగు పెట్టిన నాటినుండీ అంటూనే వుంది — ఆ బొమ్మ గోడని పెట్టుకోడం ఏమిటని. కాని కృష్ణమూర్తి ఏంమాట్లాడుతాడు? తన జీవితరహదారిలో అతిముఖ్యమైన టర్నింగు దగ్గిర మైలురాయి ఆ చిత్రం అని— పార్వతికెలా చెప్తాడు? ఆ బొమ్మంటే తనకీ యిష్టంలేదనీ, అయినా గడచిన ఘట్టాలలో ఓ అతిముఖ్యమైనదాని జ్ఞాపక చిహ్నం ఆ బొమ్మ అనీ ఎలా చెప్పకలడు? ఎవరికీ చెప్పుకోలేని తన భావాలతో సతమతమవుతూ కృష్ణమూర్తి సమాధానం చెప్పలేదు. చెప్పలేదుకూడా. మామూలు ప్రకారమే పార్వతి తనధోరణిలో తాను అనవలసిన నాలుగూ అనేసి వెళ్ళి హాల్లో పడకకుర్చీలో పడుకుంది.

కృష్ణమూర్తి సిగరెట్టు అంటించి వెల్లకిలా పడుకుని రెప్పవాల్చకుండా ఆ బొమ్మకేసి చూస్తున్నాడు. నిజమే. ఆ బొమ్మ గోడనిచూస్తే, అందరూ తమ అభిరుచిని సహితం శంకించుతారని పార్వతి అన్న మాటలు - నిజమే. మరి వసంత అభిరుచి అలాంటిదా? అన్నిటా అంతసున్నితం అయిన అభిరుచులని వ్యక్తంచేసే వసంతకి చిత్రకళలో యింతటిదా టేస్టు! ఆ రోజు పార్వతి గదిలో అడుగుపెడుతూనే అంది: "అదేం బొమ్మ గోడకి? రవివర్మ నలదమయంతులూ, వపాగారి రతీమన్మథులూ, రత్నంగారి ఏకాంతమూ రంగరించి పోతపోసినట్లుంది! టూ బేడ్, కృష్ణా! గోడనుంచి తీసేయ్." గుక్కైనా తిప్పుకోకుండా అంది. కృష్ణమూర్తి చేతనలుడిగి ఓ క్షణం అలా నిల్చుండి పోయాడు. నిజమే జాగ్రత్తగా, పరీక్షగా ఆ బొమ్మకేసే చూస్తే పార్వతి వర్ణించిన బొమ్మల లక్షణాలన్నీ వున్నాయి!

ఈనాడూ,మంచంమీద పడుకుని ఆ బొమ్మకేసే చూస్తూంటే పార్వతి అన్న మాటలు గుర్తుకి వస్తున్నాయి కృష్ణమూర్తికి. పార్వతికి ఈ ప్రపంచంలో చిత్రకారులు ముగ్గురే: టిటియన్, మైకలాంజిలో, రెన్‌బ్రాంట్. ఇక ప్రపంచంలో ఆర్టిస్టులే పుట్టలేదంటుంది. పుట్టరంటుంది. తన కలక్షన్‌లోవున్న పై ముగ్గురి బొమ్మలూ (రిప్రొడక్షనులు మాత్రమే!) తప్ప ప్రపంచంలో యిక చెప్పుకోతగ్గవేవీ లేవంటుంది. 'అదికాదు పార్వతీ, నీకు వాళ్లు తప్ప యింకెవరూ నచ్చేలేదను; అంతేకాని యింక ఆర్టిస్టులే లేరంటే ఎలా? భారతీయ చిత్రకళలో, చిత్రకారులలో ఎంతటి పొటెన్షియాలిటీస్ వున్నాయో నీకేం తెలుసు?' అని అంటే 'భారతీయకళా ఏదీ? ఎక్కడుంది!' (చెంబూ తప్పేలా లలా!) అంటూ, 'మొన్నెవరో అన్నారులే - భారతీయ చిత్రకళా? 'శ్రీనివాసులుకీ సర్రియలిస్టుకీ' మధ్య వెతుక్కో ఎక్కడో అక్కడ దొరుకుతుంది అని. అలావుంది, నువ్వు చెప్పేది' అనేసుంది. అలాంటి పార్వతికి అసలు కళనుగురించి సరైన విషయాలు చెప్తామంటే ఎలాగ?

...ఆలోచిస్తున్నకొద్దీ, పార్వతిమాటల్లోని నిజం మరీప్రస్ఫుటం అవుతోంది. కాని ఆ బొమ్మని ఎలాగ

వదుల్చుకోడం? కేలెండరు కాదే చింపి పారేద్దా మంటే! తను స్వంతంగా తెచ్చి పెట్టుకొన్నదికాదే, ఏమూలో పడేద్దాం అంటే! రెండూ రెండున్నరసంవత్సరాల స్నేహం తరువాత, జరిగిన ఒక మరపురాని సంఘటన తరవాత వసంత ఆబొమ్మని యిచ్చింది: "దీన్ని గోడకి పెట్టుకో కృష్ణా దాన్ని చూస్తున్నన్నాళ్ళూ, యీ వసంతని మరిచిపోవు' అంటూ ఆ బొమ్మని వసంత యిచ్చింది.

ఈ క్షణాన మంచంమీద పడుకుని తదేక దృష్టితో బొమ్మని చూస్తూంటే ఆనాటి సంగతులన్నీ జ్ఞాపకానికి వస్తున్నాయి కృష్ణమూర్తికి. ఆ రోజుల్లో వసంతే లేకపోతేనా తను పిచ్చివాడయిపోయి వుండును. జగ్గాయి లేకుంటే వసంత ఎంత అవస్తపడేదో, వసంత చిలిపి కజ్జాలూ, వెంకి కబుర్లూలేకుంటే తనూ అలాగే అయేవాడు. ఆ రోజుల్లో యీ పార్వతిని పలకరిద్దామంటేనే భయం — ఎటుపోయి ఎటూ స్తుందో అని. అవును మరి కోపం ముక్కుచివర నుంటుంది. ఎప్పుడెళ్ళి "అన్నయున్నాడా" అని అడిగినా సరే, ఎదుటివాళ్ళు ఏమనుకుంటారో అనేనా లేకుండా, "మళ్ళీ ఏ కొంపకి పోవాలో" అనుకుంటూ పిలవడానికి లోపలికి వెళ్ళేది. కృష్ణమూర్తి అలా దడుసుకుంటూనే వెడుతూవుండే వాడు తరుచూ. అందుకే కృష్ణమూర్తిని చూస్తే చాలు మండిపడేది: అన్నగారిని తీసుకుపోయి మళ్ళీ ఏ పదిగంటలకో కాని యిల్లు చేరనివ్వడని.

ఆ రోజుల్లో పార్వతి అంటే మైమరచే వాడు కృష్ణమూర్తి. చిరునవ్వు నవ్వుతూ ఎప్పుడేనా యీ పార్వతి తనకేసి చూస్తుందా అనుకునేవాడు. చూసేది: కానీ ఆ చూపులు బుసలు కొట్టేవి. ఆ కోపంచూసి ఎందుకో అంత కోపం అనుకునేవాడు. చదరంగం ఆడుతూంటే, పజిల్సు సాల్వుచేసు కుంటూంటే, వెనకనుంచి ఒకటేసణుగుడు. 'ఈపార్వతినిఎవడు కట్టుకుంటాడోగాని' అంటూంటే వాడు పార్వతి అన్నయ్య. 'ఎవరేంచేసినా తనకోసమే చెయ్యాలి. అనేమో ఆవిడ ఉద్దేశ్యం' అని కృష్ణమూర్తి కనక అంటే, 'అంత ఆడాళ్ళ అడుగులకి మడుగులులొత్తే పురుషసింహాలీయింట లేరని నాకూ తెలుసు' అనేది పార్వతి...ఇలాంటి పార్వతిని అస్తమానూ ఫేస్ చెయ్యలేక వసంత యింటికిపోయి కేరమ్సు ఆడేవాడు. అలా అలా వసంతతో చనువెక్కువయింది. రోజూ సాయంత్రం ఓసారేనా వసంతని చూసి కాస్సేపు వాళ్ళింట్లో బాతాకానీ కొట్టి యిల్లు చేరుకునేవాడు...

అలా రోజూ వెడుతుంటే వసంత ఏం అనుకోకపోయినా వాళ్ళవాళ్ళు ఎన్నెన్నో గాలిమేడలు కట్టేశారు. ఆఖరికి ఒకరోజు వాళ్ళ అమ్మ అడిగింది ఇలా ఎంతకాలం స్నేహితుల్లా వుంటారు! త్వరలో పెళ్ళిచేసుకోకూడదూ? అని. ఈ మాటలకి కృష్ణమూర్తి హడలిపోయాడు మొదట్లో. కొంచం సేపయాక అవును, వసంతని చేసుకుంటే తప్పేముంది? అనుకున్నాడు. ఈ తీయనివూహ అతనిలో సంచలనాన్ని రేకెత్తించింది. ఇదంతా జరిగిన నాలుగోరోజనుకుంటాను, బ్రౌను పేపరులో కట్టిన ఒక పేకెట్టు చేతికిస్తూ వసంత అంది: "ఇది నీ యింట్లో పెట్టుకుందికి' అని.

సిగరెట్టు అయిపోతే ఇంకోటిముట్టిస్తూ, నవ్వుకున్నాడు కృష్ణమూర్తి. ఒకవేళ...తనని ఫూల్ని చెయ్యడాని కిచ్చిందేమో వసంత అనిపించింది యిన్ని రోజులు పోయాక ఆలోచించి చూస్తే. ఆ బొమ్మ పార్వతి పరిభాషలోచెట్టుకింద బుద్ధుడి బొమ్మ! జ్ఞానోదయానికి తొలిరోజు బుద్ధుని ధ్యానంనుండి తప్పించమని మారుడు తన ఏడుగురు కూతుళ్ళనీ పంపిస్తాడు. వారు తమ నాట్యసంగీత విన్యాసాలతో బుద్ధుణ్ణి సమ్మోహనపరుపచూస్తారు. మార పుత్రికలు తాము గెలిచామని వూహించుకున్నారు. కాని బుద్ధుడే గెలిచాడు. ఈ ఘట్టాన్నే చిత్రీకరించాడు చిత్రకారుడు. కాని ప్రతి మారపుత్రికకీ జోడుగా బుద్ధులని చిత్రించాడు! ఎందుకో? పార్వతి అంటుంది: పాపం, రాసలీల వేద్దామని తోచిందేమో మధ్యలో అని. సరిగ్గా అలాగే వుంది మరి. మారపుత్రికలు మార్లిన్ మన్రోలనీ జాజా గబ్బార్‌లనీ జ్ఞప్తికి తెస్తూంటే, బుద్ధులు ఎరోల్‌ఫ్లిన్‌లాగా ఎన్. టి. రామారావుల్లాగా వున్నారు! చెట్టుకింద బుద్ధుడు మాత్రం బుద్ధిగా కూర్చునివున్నాడు. నిజమే యీ చిత్రం వసంత యిస్తే యిచ్చింది కాని తనేలా గోడకి తగిలించాడు?

ఆ రోజు బొమ్మ చేతులో పెడుతూ వసంత నిజం చెప్పింది: "అమ్మకేంలే పెద్దదికనక తోచినది అనేసింది. నువ్వుకానిదాన్ని సీరియస్‌గా తీసుకునేవు సుమా...నీకు తెలుసుగా జగ్గాయికి ఉద్యోగం దొరగ్గానే మేం యిద్దరం పెళ్ళిచేసుకుంటాం. నువ్వేం అనవసరపు ఆశలు పెట్టుకోలేదుకదూ?" చివరకి అడిగింది. వసంత నిర్మొహమాటానికి ఆశ్చర్యపడ్డాడు కృష్ణమూర్తి. సంతోషించాడు. తను మనస్సులో ఆరాధిస్తూ పలకరించడానికే భయపడే పార్వతే యిలా చెప్పగల్గితే! అనుకున్నాడు.

...పార్వతి చెప్పలేదు. కాని పార్వతి అన్నాయి అన్నీ తేల్చేశాడు. 'కృష్ణని నువ్వు పెళ్ళిచేసుకోవాలి' అన్నాట్ట. 'నే చేసుకోనని అన్నానా?' అని ఎదురుప్రశ్న వేసిందట! యీ సంగతి విని కృష్ణమూర్తి వాపోయాడు—వృధా అయిన కాలాన్ని తలపోసి.

ధర్మపత్నిగా యింట్లో అడుగుపెట్టిన రోజునే ఆ బొమ్మని చూసి పార్వతి విరుచుకుపడింది. కృష్ణమూర్తి ఏం చేస్తాడు?

కృష్ణమూర్తికి అలా పడుకుని యోచిస్తూంటే గడచిన ఘట్టాలనీ, యీ బొమ్మ నేం చేయాలనే ఆలోచనలనీ దాటుకుని మెరపులాంటి ఒక ఆలోచన వచ్చింది. లేచి సిగరెట్టు పారేసి గోడనుంచి బొమ్మతీశాడు. కాగితాన్ని చుట్టాడు. టేబిలు వెనక గోడకి జేరవేశాడు. హాల్లోకి వెళ్ళి పార్వతిని లేపాడు. యిక్కడే పడుకుంటే ఎలా వూరుకున్నావంటూ లేచింది పార్వతి.

పార్వతిని మంచంమీద కూర్చోబెడుతూ "చూడు పారూ ఆ బొమ్మ తీసేశాను, నీ స్నేహితుల వెవరివైనా పుట్టినరోజు పండుగలూ, యింకేమైనా వస్తే దాన్ని తీసికెళ్ళి ప్రెజెంటు చెయ్యి. సరేనా?" అన్నాడు. సంతోషంతో పార్వతికళ్లు మెరిసాయి. కృష్ణమూర్తి తల చేతుల్లోకి తీసుకుంటూ అంది. 'మా తుండుకి మంచిహృదయంయిచ్చాడు దేవుడు. కాని తల్లో చిన్న కుమ్మరి పురుగుని పెట్టాడు. అది వున్న బుద్ధిని కాస్తా దొల్చేస్తూ వుంటుంది... అడుగున పడిపోయిన బుద్ధి తిరిగీ పైకిరావడానికి టైమ్ పడుతూ వుంటుంది!' ముద్దుగా తల నిమురుతూన్న పార్వతిని చూసి 'అందుకే నిన్ను సృష్టించాడు దేవుడు' అన్నాడుకృష్ణమూర్తి.

వారం పదిరోజులు హాయిగా గడచిపోయాయి; గాఢనిద్రలోంచి ఎవరో కుదిపితే లేచినట్లయింది కృష్ణమూర్తికి ఆరోజు మధ్యాహ్నం: వసంత ఉత్తరం అది: నేనిచ్చిన మర్నాడే నాకు తిరిగి వస్తుందనుకున్న బొమ్మ యీనాటికేనా నాకు వచ్చింది.— నీ పార్వతి తెలివితేటలవల్ల. నిన్న నా పుట్టినరోజు. పార్వతి బహుమతి. వెనక ఎంత చక్కటి వాక్యం రాసిందని! "నా భర్తకి అతిప్రియం అయినా యీ బొమ్మని నాకతిప్రియమయిన నీకు కానుకగా యిస్తున్నాను" అంది అల్లుడి సొమ్ము అత్త ధారపోసినట్లు! ... అయినా యిన్నాళ్లు గోడకిపెట్టి ఆ బొమ్మని చూస్తూ ఎలావున్నావు?.. ఉత్తరం యింక చదవడం మానేశాడు కృష్ణమూర్తి. చింపి పారేశాడు. గదిలో పార్వతి కూనిరాగాలు తీస్తూ తలగడా గలీబులు కుడుతోంది. లోపలికి పోయి అమాంతంగా పార్వతిని చేతుల్లోకి తీసుకున్నాడు; సూది గుచ్చుకున్నా లెక్కచెయ్యకుండా "ఎంత ఘటికురాలివి పార్వతీ" అంటూ హృదయానికి హత్తుకున్నాడు. ఎందుకొచ్చిందో యీ ఉత్సాహం అర్థం కాకపోయినా పార్వతి సరేనని ఒప్పుకుంది: తను ఘటికురాలినే అని.

కాని యిప్పటికీ ఎప్పటికీ కృష్ణమూర్తి పార్వతికి చెప్పని చెప్పలేని నిజం ఒకటివుంది: అదే ఆ బొమ్మ కథ!

---

విజ్ఞానంలోని అన్ని విభాగాలవలెనే, తాత్వికజిజ్ఞాసకూడా వాస్తవిక జీవితాని కుపయోగించేదిగా ఉండాలి. "తత్వజిజ్ఞాస" నిరూపించిన సత్యాలయినా, అవి సర్వకాలాలకూ వర్తించే అమరసత్యాలు కానేరవు. ఆ యుగధర్మంలో మానవుడికి ఉపయోగిస్తాయా లేదా అన్నదే ఆలోచించాలి.—డి. డెయ్‌మ్ రాఫేల్